بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 16.12.2022 (Telugu)**

## హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం విశ్వాసభరిత ఆదేశముల ఆధారంగా దుఆ వాస్తవికత, నిబంధనలు, అవసరము, మన బాధ్యతల ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 16.12. 2022 తేదీన - మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

**అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీకలహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహు వ రసూలుహు. అమ్మా బఅదు ఫఅవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్ - బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం - అల్ హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ - అర్రహ్మా నిర్రహీం - మాలికి యౌమిద్దీన్ - ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్ - ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ - సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహిం ఘైరిల్ మఘ్‌జూబి అలైహిం వలజ్జాల్లీన్. (ఆమీన్)**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

దుఆ గురించి ప్రజలు సందేహాలు అడుగుతుంటారు. దుఆ, దేవుని గురించి ప్రణాళికబద్ధంగా నాస్తికమును ప్రోత్సహించువారు విమర్శలు చేస్తుంటారు. దేవుడు, మతము నుండి మానవుణ్ణి దూరము చేయుటకు ప్రయత్నము చేయబడుతుంది. ఇటువంటి పరిస్థితులలో మన సభ్యులపై కూడ షైతానీ ఆలోచనల ప్రభావములు వేస్తుంటారు. అల్ప జ్ఞానుల హృదయములలో సందేహాలు కలుగుతాయి. చిన్నపాటి పరీక్ష వలన అల్లాహ్ తఆలా ఉనికి, అతను దుఆలు వినుట గురించి విమర్శలు తలెత్తుతాయి.

కావున నేడు దుఆ అంశము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఆదేశముల ఆధారంగా ప్రస్తావింతును. హుజూర్ రచనలలో దుఆ వాస్తవికత, నిబంధనలు, మన బాధ్యతలు, దుఆ అవసరము, అల్లాహ్ తఆలాను నమ్ముట గురించి చాలా వివరణ గలదు. సుఖంగా వున్నప్పుడు కూడ మనము దుఆల వైపు శ్రద్ధ చూపవలెను. తద్వారా కష్టములలో మన దుఆలు ఆమోదించబడునను విషయమును తెలుపుతు వారు (అ) ఇట్లనిరి. ఏదేని ఆపద వచ్చినప్పుడు అల్లాహ్ తఆలాతో భయపడినట్లే శాంతియుత సమయములో భయపడువానిని అల్లాహ్ కరుణించుగాక! సుఖముగా వున్నప్పుడు అల్లాహ్ తఆలాను విస్మరించని వ్యక్తిని అల్లాహ్ తఆలా ఆపద కాలములో విస్మరించడు. సుఖంగా వున్నప్పుడు ఐశ్వర్యముతో జీవితము గడిపి, ఆపద కాలములో దుఆ చేసినవాని దుఆలు ఆమోదించబడవు. ఆపదలు వచ్చిపడ్డప్పుడు పశ్చత్తాప ద్వారము మూసుకుపోతుంది.

దుఆ చేస్తున్నప్పుడు మానవుని స్థితి ఎట్లుండవలెనో వివరిస్తు, దుఆ నిబంధనలు ఏమిటని తెలుపుతు వారు (అ) ఇట్లనిరి. అల్లాహ్ తఆలాతో అడుగుతున్నప్పుడు గౌరవ, మర్యాదలను పాటించుట అనివార్యము. వివేకవంతుడు రాజుతో ఏదేని విషయమును అడిగినప్పుడు గౌరవ, మర్యాదను పాటించును. అందుకే అల్‌ఫాతిహా అధ్యాయములో అల్లాహ్ తఆలా ఎలా అడుగవలెనో ఇట్లు నేర్పించెను. **అల్‌హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్** అనగా సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములు. **అర్రహ్మాన్** అనగా అడగనిదే ఇచ్చువాడు. **అర్రహీమ్** నిజమైన శ్రమ జీవికి సత్ఫలితములను అందిస్తాడు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నిజమైన శ్రమ అనే పదములను గ్రహించండి. నిజమైన శ్రమ ప్రమాణాలను అల్లాహ్ తఆలా స్వయంగా వివరించాడు. అనగా తీవ్ర ప్రయత్నము చేయవలసి వచ్చును.

అనంతరం **మాలికి యౌమిద్దీన్** అనగా ఇహపరలోకములో ఫలితమిచ్చు, శిక్షించు మొత్తం అధికారము అతనికే వున్నది. ఇంత వరకు ప్రశంసించిన తర్వాత తన దేవుడు ఎంత గొప్పవాడో అతనికి ఆలోచన కలుగుతుంది. అప్పుడు దేవుణ్ణి ప్రత్యక్షముగా వున్నాడని భావిస్తు పిలుస్తాడు. **ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్** అనగా మేము నిన్నే ఆరాధింతుము లేదా ఆరాధించదలచితిమి, నీతోనే అడుగు తున్నాము. **ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ-సిరాతల్లజీన అన్అమ్త అలైహిమ్** అనగా ఎలాంటి మలుపులు లేని సత్పథమున మమ్ము నడిపించుము. అంధులదొక మార్గముండును. దానిలో కష్టపడినచో ఎలాంటి ఫలితము వెలువడదు. ఆచరించినచో సత్ఫలితములు వెలువడితేనే సత్పథము అనబడును. **ఘైరిల్ మఘ్జూబి అలైహిమ్** నీ ఆగ్రహానికి గురైన వారి మార్గమున కాదు. **వలజ్జాల్లీన్** సన్మార్గము కోల్పోయిన వారి మర్గమున కాదు. ఇట్లనిరి. **ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ** అనగా ప్రపంచం మొత్తంతో పాటు ధర్మ మార్గము కోరబడెను.అల్లాహ్ తఆలాకు హద్దులు లేనట్లే అతని దశలు, స్థాయికి ఎలాంటి పరిమితి లేదు.

ఇట్లనిరి. దుఆ ఎంతో విచిత్రమైన విషయము. కాని విచారమేమనగా దుఆ చేయువారికి దుఆ నిబంధనలు తెలియవు, దుఆ చేయించు వారికి కూడ దుఆల ఆమోదము, దుఆ నిబంధనలు ఈ కాలములో తెలియవు. వాస్తవానికి దుఆ యదార్థము బొత్తిగా తెలియదు. దుఆ చేయువారు సహనము పాటించవలెనని తెలుపుతు ఇట్లనిరి. చూడండి! ఒక వ్యవసాయదారుడు బయటికి వెళ్లి తన చెలుకలో విత్తనము నాటినట్లే దుఆ పరిస్థితి గలదు. బాహ్యముగా చూసినచో అతడు ఒక మంచి విత్తనమును బయట చెలుకలో నాటెను. కాని అది ఎప్పుడు ఫలమందించునో తెలివిమంతుడైన వ్యవసాయదారునికి బాగా తెలుసు. అందుకే అతడు ఓపికతో దానిని పర్యవేక్షించును, దానిని పోషించును. ఇలా దానికి పండ్లు కాసే సమయము వచ్చేస్తుంది, తుదకు అవి పండుతాయి కూడ. దుఆ పరిస్థితి కూడ ఇలాగే వుండును.

ఇట్లనిరి. నేను నా అనుభవముతో చూశాను. ఏదేని విషయములో సుదీర్ఘ సమయము వరకు మౌనము కనిపించినచో తుదకు విజయము లభిస్తుందని మాజీ సత్యమూర్తుల అనుభవము కూడ ఇందుకు సాక్ష్యముగా వున్నది. దయామయుడైన అల్లాహ్ తఆలా సిగ్గుగల వాడు. అతని వినయుడైన దాసుడు సుదీర్ఘ కాలము నుండి అతని ఆస్థానములో పడివున్నట్లు చూసి అతనిని ఎన్నడు విఫలము చేయదు. ఒక గర్భిణి నాలుగు, ఐదు నెలల తర్వాత నాకు ప్రసవం ఎందుకు కావడం లేదని అంటూ, ఇదే కోరికలో లీనమై ప్రసవమునకు ఏదేని మందు తిన్నచో అప్పుడు ప్రసవం జరుగునా లేదా ఒక నిరాశ కలిగించు స్థితిని ఆమె ఎదుర్కొనునా? ఇలాగే నిర్ణీత సమయము కంటే ముందే తొందర పడు వ్యక్తి నష్ట పడును. నష్టము మాత్రమే కాదు విశ్వాసము కూడ ఆపదలో పడును. ఇటువంటి పరిస్థితిలోనే కొందరు నాస్తికులవుతారు.

ఇట్లనిరి. చూడండి! తన సంతానమైన అరబ్‌లోని ఒక ప్రవక్త కావలెనని ఇబ్రాహీమ్ (అ) ఒక దుఆ చేసిరి. అది తక్షణమే ఆమోదించబడిందా? ఇబ్రాహీమ్ (అ) తర్వాత చాలా సుదీర్ఘ కాలము వరకు ఆ దుఆ ఎలాంటి ప్రభావము చూపినదనే ఆలోచన కూడ ఎవరికి రాలేదు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించడంతో ఆ దుఆ కార్యరూపం దాల్చినది. అంతేకాక ఎంతో గొప్పగా పూర్తి అయినది.

దుఆ ఆమోదము కొరకు శరీరము, ఆత్మ మధ్య ఎటువంటి అనుబంధము వుండవలెనో తెలుపుతు వారు (అ) ఇట్లనిరి. బాహ్య నమాజ్, ఉపవాసమునకు తోడుగా వినయము, సత్యము లేకున్నచో అది

ఎలాంటి విశిష్టత కలిగి వుండదు. జోగులు, సన్యాసులు కూడ తమ పద్ధతిలో చాలా కఠినమైన కసరత్తులు చేస్తారు. ఈ బాధలు వారికి ఎలాంటి కాంతి లేదా ప్రశాంతతను ప్రసాదించవు. వారు శారీరక కసరత్తు చేస్తారు. వాటికి అంతర సంబంధము తక్కువగా వుండును. వారిపై ఎలాంటి ఆధ్యాత్మిక ప్రభావము పడదు. కాని పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను. అల్లాహ్ తఆలాకు మీ బలిదానముల మాంసము, రక్తము అందక నిష్టాపరత అందుతుంది. యదార్థమేమనగా అల్లాహ్ తఆలా పొట్టును కాక బీజమును ఇష్టపడును. మాంసము, రక్తము చేరనప్పుడు బలిదాన అవసరమేమిటి? అనే ప్రశ్న ఉత్పన్న మగుతుంది. ఇలాగే నమాజ్, ఉపవాసము ఆత్మకు సంబంధించిన వైనచో బాహ్య అవసరమేముంది? ఇట్లనిరి. శరీరముతో పని తీసుకోవడం మానేసిన వారి మాట ఆత్మ కూడ వినదనే విషయము విధితమే. వారిలో అసలు ఉద్దేశమైన వినయము, దాసత్వము ఏర్పడదు. ఎవరైతే కేవలం శరీరముతో పని తీసుకుంటూ ఆత్మను చేర్చరో వారు కూడ ఘోర తప్పిదానికి పాల్పడుతారు. ఆత్మకు, శరీరమునకు అల్లాహ్ తఆలా పరస్పరం సంబంధమేర్పరచెను. శరీర ప్రభావము ఆత్మపై కూడ పడుతుంది. ఉదా॥ ఒక వ్యక్తి ఏడ్చునట్లు నటించినచో తుదకు అతనికి ఏడ్పు రానే వస్తుంది. ఇలాగే నమాజ్‌లోని పరిస్థితులు ఎంతవరకైతే శరీరముపై పడుతాయో ఉదా॥ నిలబడుట, మోకరిల్లుట వంటి వాటి ప్రభావము ఆత్మపై కూడ పడును. శరీరము ద్వారా ఎంత వినయము చూపుతాడో అంతే ఆత్మలో కూడ ఏర్పడును. కేవలం బాహ్య సాష్టాంగమును అల్లాహ్ తఆలా ఆమోదించదు కాని సాష్టాంగమునకు ఆత్మతో ఒక ప్రత్యేక సంబంధమున్నది. అందుకే నమాజ్‌లో అత్యంత వినయ స్థితి సాష్టాంగమే. ఎప్పుడైతే మానవుడు వినయపు చివరి దశకు చేరుకొనునో అప్పుడు అతడు సాష్టాంగము చేయదలచును. అందుకే శరీరమునకు ఆత్మతో ఒక ప్రత్యేక సంబంధము గలదు.

మరింత వివరిస్తు వారు (అ) ఇట్లనిరి. నమాజ్‌లో అభిరుచి కలగడం లేదని కొందరంటారు. అభిరుచి తమ అధీనములో లేదని వారికి తెలియదు. అభిరుచి ప్రమాణాలు కూడ భిన్నంగా వుంటాయి. ఒక వ్యక్తి తీవ్ర ఇబ్బందుల్లో వున్నను ఆ బాధలో కూడ అతను అభిరుచి పొందుతాడు. దుఃఖము తర్వాతనే సర్వ అభిరుచి, సుఖము వచ్చును. అందుకే పవిత్ర ఖుర్ఆన్ ఈ సూత్రమును సూచించెను. అనగా **ఇన్న మఅల్ ఉస్రి యుస్రా** సుఖము కంటే ముందు దుఃఖము లేనిచో అది సుఖము అనబడదు. మాకు ప్రార్థనలో అభిరుచి రావడం లేదనే వారు ప్రార్థన కొరకు ఎంత మేరకు దుఃఖము, బాధలు ఎదుర్కొన్నారో మొదట తమ స్థితి గురించి ఆలోచించవలెను. ఏ ఏ దుఃఖము, ఇబ్బందులను మానవుడు ఎదుర్కొంటాడో అవే రూపు మార్చుకొని ఆనందముగా మారుతాయి. వారు (అ) ఇట్లనిరి. ఈ దుఃఖములతో నా ఉద్దేశమేమనగా మానవుడు తనంతట తాను అనవసరంగా కష్టములలో పడవేసుకోకూడదు, శక్తిని మించి బాధలను ఎదుర్కొను దావాలు చేయకూడదు. నా ఉద్దేశము కేవలం ఐదు పూటల నమాజులను పూర్తి శ్రద్ధతో, నియమ నిబంధనలతో సలుపుటకు ప్రయత్నించవలెను. నిద్రను కూడ త్యాగము చేయవలెను, తమ వ్యాపారములను కూడ త్యాగము చేయవలెను, తద్వారా నిర్ణీత సమయములో నమాజ్ సలుపుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తఆలా పట్ల భయము కూడ కలిగి వుండవలెను.

కొందరు స్వయంగా ఎలాంటి బాధను ఎదుర్కొనని వారు కూడ వుంటారు. ఇతరులతో దుఆ చేయించుకోవడంతోనే పనులు పూర్తి అవుతాయని భావింతురు. ఇటువంటి సందర్భముల గురించియే హుజూర్ (అ) ఒక వ్యక్తితో ఇట్లనిరి. మీరు కూడ స్వయంగా శ్రద్ధతో దుఆ చేసినప్పుడే నా దుఆలు సైతం ప్రభావము చూపుతాయి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా నీకు ఏమిచ్చాడు! మత ప్రయోజనమేమిటి! మతము అలసత్వానికి గురి చేస్తుంది, మతము ఊహాజనిత ఆలోచనలు మనసులలో కల్పిస్తుందనే ఆలోచనలను ప్రజలలో కల్పించుటకు ప్రస్తుతం ధర్మము, అల్లాహ్ తఆలా వ్యతిరేకులు, నాస్తిక భావాల అభిమానులు పూర్తి శ్రద్ధను కనబర్చుతున్నారు. ఇటువంటి తరుణంలో అల్లాహ్ తఆలాతో గట్టి అనుబంధము కలిగించుటకొనుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము. ప్రార్థనలను రక్షించుకొనుట, దుఆలపై నమ్మకము కలిగి ఉండుట ప్రతి అహ్మదీయుని బాధ్యత.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. తమ విశ్వాసమును పెంచుకోవలసిన అవసరము మన జమాఅత్‌కు గలదు. అల్లాహ్ తఆలాపై నిజమైన నమ్మకము, జ్ఞానము కలిగించుకోవలెను. సత్కర్మలలో సోమరితనం, అలసట వుండకూడదు, ఎందుకనగా సోమరితనమున్నచో తహజ్జుద్ కొరకు లేచుట చాలా కష్టమగును, ఇతర నమాజులకు వుజూ చేయుట కూడ కష్టమని అనిపించును. ఇట్లనిరి. మీలో సత్కర్మల శక్తి పుట్టనిచో, పుణ్యములలో ముందడుగు వేయుటకు మీలో ఉత్సాహము లేనిచో మాతో అనుబంధము ఏర్పరచుకొనుట నిష్ప్రయోజనమగును.

కావున చాలా చింతనతో మనము అల్లాహ్ తఆలాతో అనుబంధమును పెంచుకొనుటకు ప్రయత్నించవలెను, ఇటువంటి నిజమైన అనుబంధము ఏర్పడినప్పుడు దుఆ ఆమోద దృశ్యములను కూడ మనము చూడవచ్చును. ఇందుకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ పాకిస్తాన్, అల్ జజాయిర్ దేశముల అహ్మదీయుల కొరకు దుఆ చేయాలని ప్రత్యేక పిలుపునిస్తు ఇట్లనిరి. పాకిస్తాన్‌లో అహ్మదీయులకు ఇబ్బందులను సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాగే ప్రస్తుతం అల్‌జజాయిర్‌లో కూడ మరల కష్ట కాలం వచ్చినది. అల్లాహ్ తఆలా ప్రతి చోట ప్రతి అహ్మదీని రక్షించుగాక! ప్రతి ఇబ్బంది నుండి కాపాడుగాక! శత్రువును విఫలం, అసఫలం చేయుగాక! (ఆమీన్)

**అల్ హందులిల్లాహి నహ్మదుహు వనస్తఈనుహు వనస్తఘ్ఫిరుహు వ నూమిను బిహి వ నతవక్కలు అలైహి వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వ మిన్ సయ్యిఆతి ఆమాలినా మంయ్యహ్దిహిల్లాహు ఫలా ముజిల్లలహు వమంయ్యుజ్‌లిల్‌హు ఫలా హాదియలహు వనష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వనష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహు వ రసూలుహు. ఇబాదల్లాహి రహిమకుముల్లాహి ఇన్నల్లాహ యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్సాని వ ఇయితా ఇజిల్ ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫహ్‌షాఇ వల్ మున్‌కరి వల్ బఘిఇ యఇజుకుం లఅల్లకుం తజక్కరూన్. ఉజ్‌కురుల్లాహ యజ్‌కురుకుం వద్‌వూహు యస్తజిబ్‌లకుం వలజిక్‌రుల్లాహి అక్బర్.**

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*